# ఈ క్షణం

సికిందరాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్లో అడుగుపెట్టాడు శ్యామసుందర్.

ఎస్.ఐ. ఏదో రాసుకొంటున్నాడు.

"నమస్కారం సార్ !"

ఎస్.ఐ. తలెత్తి చూశాడు.

"ఎస్."

"నా పేరు శ్యామసుందర్ సార్."

"ఊఁ"

"నేను హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్‌లో విజయవాడనించి ట్రావెల్ చేశానండి."

"చేస్తే ?"

"రైల్లో నా బ్రీఫ్‌కేస్ పోయిందండి."

"పోయిందా ?" అంటూ ఎస్.ఐ. శ్యామసుందర్‌ని నఖశిఖపర్యంతం చూశాడు. అతని తెల్లటి లాల్చీ, పైజామా కొంచెం నలిగి ఉన్నాయి. గడ్డం మాసి ఉంది. ముఖంలో ఆందోళన వ్యక్తమవుతోంది. కొంచెం నెర్వస్‌గా ఉన్నాడు. ఓ చేతిలో పేపరుంది. రెండోచెయ్యి బల్లమీద పెట్టి కొంచెం వంగి ఏదో వేడుకొంటున్నట్టు ఎస్.ఐ. ముఖంలోకి చూస్తున్నాడు.

"ఎప్పుడు పోయింది?"

"రాత్రి బెర్త్‌మీద తలదగ్గర పెట్టి పడుకొన్నానండి. బాగా నిద్రపట్టింది. రైలు సికింద్రాబాద్ స్టేషన్ వస్తుండగా మెలకువ వచ్చింది. చూస్తే బ్రీఫ్‌కేస్ కనిపించలేదు."

"అంత అజాగ్రత్త ఐతే ఎలా?"

"అదేసార్. పొరపాటయిపోయింది. కొంచెం మెలకువగా ఉండాలిసింది...." అన్నాడు శ్యామసుందర్, ఇంకేమనాలో తోచక.

"సరే, రిపోర్టివ్వండి. బ్రీఫ్‌కేస్‌లో ఏమున్నాయి?"

"ఓ జత ట్రౌజర్స్, షర్టు, అండర్‌వేర్స్, లుంగీ, సర్టిఫికెట్లు."

"ఏం సర్టిఫికెట్లు?"

"ఎం.కాం. డిగ్రీ సర్టిఫికెట్, టెస్టిమోనియల్స్, ఇలాంటివే సార్. ఈ కాగితాలన్నీ బేగ్‌లో పెట్టి అది బ్రీఫ్‌కేస్‌లో పెట్టానండి."

"ఏదైనా ఇంటర్వ్యూకి వచ్చారా?"

"అవును సార్."

"డబ్బు ఎంతుంది?"

"రెండొందలు."

"వాడెవడో మంచి డ్రింక్‌పార్టీ చేసుకొంటాడు."

"ఇప్పుడెలా సార్?"

"ఏమిటి ఎలా"

"అదేసార్. డబ్బు పోతేపోయింది. సర్టిఫికెట్లున్నాయి. ఇంటర్వ్యూలో అవి లేకపోతే వీల్లేదు కదండి."

"మీరు కంప్లెయింట్ ఇచ్చినట్టు సర్టిఫికెట్ ఇస్తాను. అది చూపించండి."

"వాళ్ళు ఒప్పుకొంటారా?"

"వాళ్ళిష్టం."

"సరే, ఇవ్వండి సార్. నా అదృష్టం పరీక్షించుకొంటాను."

"ముందు మీరు కంప్లెయింట్ ఇవ్వండి."

శ్యామసుందర్ బల్లమీద కాగితాల వైపు చూశాడు.

"కాగితం—" నసిగాడు.

"కాగితం కూడా లేదా?"

"అన్నీ బాగ్‌లోనే ఉన్నాయండి. ట్రయిన్ కదిలే ముందు ఓ పేపరు కొని రూపాయినోటిచ్చాను. ముప్పయి పైసలు చిల్లరిచ్చాడు. అది మాత్రమే జేబులో పెట్టుకొన్నాను. అదృష్టవశాత్తూ టికెట్ జేబులోనే పెట్టుకొన్నాను." అన్నాడు శ్యామసుందర్.

"అదికూడా బ్రీఫ్‌కేస్‌లో పెట్టేస్తే సరిపోయేది." అన్నాడు ఎస్.ఐ. కొంచెం కోపంగా.

"పెట్టెవాడినే సార్ — మధ్యలో చెకింగ్ ఉంటే పెట్టె తెరవడం కొంచెం ఇబ్బందిగా ఉంటుందని జేబులో పెట్టుకొన్నాను." అన్నాడు శ్యామసుందర్ కొంచెం అమాయకంగా.

"ఎవడూ జేబు కొట్టలేదు నయం" అన్నాడు ఎస్.ఐ. విసుగ్గా.

"బ్రీఫ్‌కేసు బదులు జేబు కొట్టేసినా బాగుండేది సార్. టికెట్టూ, ముప్ఫయి పైసలేగా వాడికి దక్కేది."

"సరే, కంప్లెయింట్ రాయండి" అని దయ తలుస్తున్నట్టు ఓ కాయితం తీసి శ్యామసుందర్ వైపుకి బల్లమీద తోస్తూ అన్నాడు ఎస్.ఐ.

"కలం-" నసిగాడు శ్యామసుందర్.

"అదీలేదా ? ఊ-" ఎస్.ఐ. చిరాగ్గా కలం బల్లమీద పడేశాడు.

"థాంక్స్ సర్,"

శ్యామసుందర్ చప్పున కంప్లెయింట్ రాసి ఎస్.ఐ.కి అందించాడు. ఎస్.ఐ. దానివైపు ఓ చూపు విసిరి ఫైళ్ళకట్టలోకి తోశాడు.

"ఆల్‌రైట్" ఇంక వెళ్ళమన్నట్టు అన్నాడు ఎస్.ఐ.

"దొరుకుతుందా సార్ ?"

"ప్రయత్నిస్తాం. దొరికితే తెలియచేస్తాం."

"అలా అంటే కాదు సార్-మీరు కాస్త...." కొంచెం బతిమాలుకొంటున్నట్టు ముఖం పెట్టాడు శ్యామసుందర్.

"నన్నేం చెయ్యమంటావయ్యా, మనుషుల్ని మనుషుల్నే మాయం చేస్తుంటే దిక్కులేదు గాని నా బ్రీఫ్‌కేసో అంటావేమిటయ్యా ? చూద్దాం, మా డ్యూటీ మేం చేస్తాం."

"థాంక్స్ సర్. ఓ రిక్వెస్ట్."

"ఏమిటి ?"

"నా దగ్గిర కేవలం ముప్ఫయి పైసలే ఉన్నాయి."

"ఉంటే ?"

"ఇవాళంతా హైద్రాబాద్‌లో ఉండాలి, ఇంటర్వ్యూకి వెళ్ళడానికి సరైన దుస్తులు కావాలి, తిరుగు ప్రయాణానికి డబ్బు కావాలి."

"ఏం చేస్తాం ? వాచ్ అమ్మేసుకో."

"వాచ్–" నసిగాడు శ్యామసుందర్.

"ఏం, అదికూడా బ్రీఫ్ కేస్‌లోనే ఉందా ?"

"అవును సార్. నాది ప్లాస్టిక్ స్ట్రాప్, నిద్రలో ఎవరైనా కత్తిరిస్తారేమోనని" నసిగాడు అతను.

"మిస్టర్ బ్రీఫ్‌కేస్ ?" మందలింపూ ఎగతాళి నవ్వులో ద్యోతకం చేస్తూ అన్నాడు ఎస్.ఐ.

"మీరేదైనా సహాయం చేస్తే-అంటే అప్పుగా ఇస్తే."

"నేనా !" అంతకంటే ఆశ్చర్యకరమైన విషయం ఇంకేమైనా ఉందా ? అన్నట్టుగా ధ్వనించాడు ఎస్.ఐ.

"మీరంటే వ్యక్తిగతంగా మీరని కాదు సార్. పోలీస్ డిపార్ట్ మెంటు."

"పోలీస్ డిపార్ట్‌మెంటుకి నీలాంటి అజాగ్రత్త మనుషులందరికీ ఋణాలు సరఫరా చెయ్యటమేనా పని ?" కోపంగా అన్నాడు ఎస్.ఐ.

"అదికాదు సార్. ఇక్కడ నాకెవరూ లేరు. ఎవరూ తెలియరు. ఇలా చికాకులో పడిపోయాను. శాంతిభద్రతల్ని పరిరక్షించేది మీరు. మీరు కాకపోతే మరి నాకెవరు సాయం చేస్తారు ?"

"సాయం చెయ్యటానికి మీరేమైనా మైనరా,ఆడపిల్లా?లేకపోతే వికలాంగులా?"

"కాకపోతే మాత్రం ? కొంచెం సిగ్గుపడుతూనే అన్నాడు శ్యామసుందర్.

"మీ కాళ్ళమీద మీరు నిలబడే వయసులో ఎవరి సాయమో అడగటానికి మీకు నామోషిగా లేదా ?"

"అదికాదు. మీబాధ్యత గురించి మాట్లాడుతున్నాను అన్నాడు" శ్యామసుందర్ కొంచెం ధైర్యంగా.

"మా బాధ్యత మాకు తెలుసు మిస్టర్ శ్యామసుందర్."

"ఒక వ్యక్తిని విపత్కర పరిస్థితి నించి రక్షించే బాధ్యత ప్రభుత్వానికి లేదా ?"

"ప్రభుత్వం నేరం జరక్కుండా కట్టుదిట్టాలు చేస్తుంది. జరిగితే చర్య తీసుకుంటుంది.,,

"వ్యక్తిసంక్షేమం సంక్షేమరాజ్యం కర్తవ్యం కదా !,,

"కావొచ్చు. వ్యక్తి సంక్షేమం అంటే ప్రభుత్వం దృష్టిలో సగటు వ్యక్తి సంక్షేమం. వస్తువు, సేవలు డివైడెడ్ బై జనాభా."

"సగటు మనిషి అనే వ్యక్తి అసలు ఉంటాడా ? అది అవాస్తవికం కాదా?"

"ప్రభుత్వం సహజమా? అది మనం కల్పించుకొన్నదే కదా. అదోయంత్రం. కంప్యూటర్. ప్రతి వ్యక్తి సమాచారం అందులో ఉండదు వ్యక్తిగత అవశ్యకతలు సూచించటానికీ, దాని ప్రకారం మేం చర్య తీసుకోటానికీ. మీరు విద్యావంతులు, ఇవన్నీ మీకు తెలిసే అడుగుతున్నారు."

"అయితే నా అవసరం కోసం నేను దొంగతనం చేస్తే ?"— అసహనంగా అన్నాడు శ్యామసుందర్.

"పట్టుబడితే జైల్లో పెడతాం" అన్నాడు ఎస్.ఐ.

"థాంక్యూ" అన్నాడు శ్యామసుందర్ చిరునవ్వుతో.

"నో మెన్షన్" అన్నాడు ఎస్.ఐ. గంభీరంగానే.

శ్యామసుందర్ స్టేషన్ బయటకి వచ్చాడు. అతని కేం చెయ్యాలో తోచలేదు. నడుస్తున్నాడు. ఎస్.ఐ. మాటలు అతని చెవుల్లో మోగుతున్నాయి. ఆయనికి ఎంతో వయసు లేదు. సంస్కారం ఉన్నవాడే. ఒక వ్యవస్థ తరఫున బాగానే మాట్లాడాడు. అయితే ఆ వ్యవస్థ ఇప్పుడు తనకి ఎందుకూ పనికిరాకుండా పోతోంది.

శ్యామసుందర్‌కి కాఫీ తాగాలనిపించింది. ఇంట్లో అయితే ఈపాటికి రెండు మూడుసార్లు తాగేవాడు. జేబులో ముప్పయి పైసలే ఉన్నాయి. కాఫీకి చాలవు. అతను ఇలాంటి ఇబ్బంది ఎప్పుడూ ఇంతవరకు ఎదుర్కోలేదు. బయట కాఫీ తాగాలనిపిస్తే హోటల్‌కి దారితియ్యటమే. ఇప్పుడు తన దారికి అటూ ఇటూ కూడా ఏవో చాలా హోటళ్ళు కనిపిస్తున్నా, తను హోటల్‌కి వెళ్ళలేడు ! అవి తన కోసం కావు. ఆ కష్టమర్లలో తను ఒకనాడు, అకస్మాత్తుగా అతనికో వింత భావన కలిగింది ! నాలుకకి కాఫీ చేదుగా తోచినట్టయింది. అతనికి నవ్వొచ్చింది.

జనంలోంచి తప్పించుకొంటూ శ్యామసుందర్ ముందుకి వెడుతున్నాడు. జనాన్ని తను తప్పించుకొంటున్నాడా ! జనం తనని తప్పించుకొంటున్నారా ! ఎవరూ తనని ప్రత్యేకంగా చూడటం లేదు ! తనెందుకో అందర్నీ ప్రత్యేకంగా చూస్తున్నాడు. తన ఊళ్లో బయటికి వెడితే ఎందరో ఎదురై చిరునవ్వులు చిందిస్తూ పలకరించిపోయేవాళ్లు.

తనూ ఎందర్నో నవ్వుతూ పలకరించేవాడు. ఇక్కడ అంతా కొత్త. తను ఎవరికీ అక్కర్లేదు. తనకి ఎవరూ అక్కర్లేదా ? తనే పలకరిస్తే ? ఎవర్ని పలకరించేట్టు ? ఏమని పలకరించేట్టు? ఎందుకు పలకరించేట్టు ? పలకరిస్తే ఎవరు ఏమనుకుంటారో ?

ఏమిటీ అనుమానాలు ? ఏరు పల్లంలోకి ప్రవహించేట్టు వ్యక్తి సమాజంలోకి చొచ్చుకుపోవాలి. వరదలా సమాజంలోకి ఉప్పొంగి పోవాలి, అయితే సమాజం వ్యక్తిలోకి ఉప్పొంగుతుందా ? ఏరు వెనక్కి ప్రవహిస్తుందా ? శ్యామసుందర్ నవ్వుకున్నాడు. ఏరు ఉపమానం కుదరదు. తనలో సమాజం లేదా ? ఎంతవరకుంది ? తనలో "తను" ఎక్కువా, సమాజం ఎక్కువా ? రెండూ సమానమా ? తనే ఎక్కువైతే చివరికి తార్కికంగా ఏమవుతుంది ? సమాజమే ఎక్కువైతే ?

తను తనకోసం జీవిస్తున్నాడా ? సమాజం కోసం జీవిస్తున్నాడా ? తనకోసం సమాజం కోసం కూడానా ? ఏమిటీ వెర్రి ఆలోచనలు ?

శ్యామసుందర్ చప్పున నాలుగడుగులు ముందువేసి, ముందు పోతున్న యువకుణ్ని కలుసుకొన్నాడు.

"ఎక్స్‌క్యూజ్ మీ!"

ఆ యువకుడు శ్యామసుందర్ వైపు తిరిగి అతన్ని ఎగాదిగా చూశాడు.

"ఏం కావాలి ?"

ఏదో కావాలిస్తేగాని పలకరించికూడదా ? మానవ సంబంధాలన్నీ అవసర సంబంధాలేనా ? శ్యామసుందర్ కొంచెం చిన్నబుచ్చుకొన్నాడు.

"ఏదో కావాలని కాదు. కొంచెం ఒంటరిగా ఫీలై మిమ్మల్ని పలకరించాను. అంతే."

"ఎవరు మీరు?"

ఎవరు తను ? శ్యామసుందర్ ! అంతే ? తను నిజంగా శ్యామసుందరుడు కాదు. అదో సంకేతం. ఆ సంకేతానికి ప్రత్యేకమైన అర్థంలేదు. ఒక పరిచయాన్ని బట్టి సంకేతానికి అర్థం ఉంటుంది. ఫలానా ఫలానా అని గుర్తించటానికే సంకేతం. ఫలానా వారి కుమారుడు, ఫలానా గ్రామం, ఫలానా ఉద్యోగం—అలా ఫలానా ఫలానా అని చెబితే అతనికేం తెలియదు. ఆ ఫలానాలకీ అతనికీ సంబంధం లేదా. ఓహో! అంటారు కాని తనని గురించిన అతని జ్ఞానం అణుమాత్రం పెరగదు. తను నిజం

చెప్పినా, అబద్ధం చెప్పినా అదే పరిస్థితి. దానికి విలువలేదు. అరణ్యంలో తిరిగే జంతువులకి పేర్లుండవు. కాని వాటికేదో సహజజ్ఞానం ఉంటుంది. అవి తోటి ప్రాణుల్ని గుర్తిస్తాయి. మనిషి సహజజ్ఞానం నించి చాలా దూరం వెళ్ళాడు. అనేక సంకేతాల్ని సృష్టించుకొన్నాడు. మనిషిని మనిషిగా కాక సంకేతాలుగా గుర్తించే స్థితికి వెళ్ళాడు. పెట్టుబడిదారు, శ్రామికుడు, వర్తకుడు, అధికారి, గుమాస్తా, ప్రతినిధి, దొర, పోలీస్, శాసనసభ్యుడు, నటుడు, చిత్రకారుడు, రచయిత, డ్రైవర్, క్లీనర్, పండితుడు పామరుడు, శాస్త్రి, నాయుడు, హిందువు, గురువు, శిష్యుడు, అభ్యర్థి, ధార్మికుడు, దేవుడు, ఇలా ఇలా ఎన్నో సంకేతాలు. ఈ కుప్పలకుప్పల సంకేతాల ట్రాఫిక్‌లో ఏక్సిడెంటయిన అసలు మనిషి ఎక్కడో ఏ మారుమూల హాస్పిటల్లో ఆక్సిజన్ సహాయంతో కొనఊపిరి మీదున్నాడు ! మళ్ళీ సంకేతం ! ఆక్సిజన్. ఆ మనిషిని పొలిమేర దాటకుండా ఇవతలికి లాగుతున్నది ఏదో ఎవరిదో ఏ వేవ్‌లెంగ్త్ మీదో స్పందిస్తున్న ఓ హృదయమా? ఏమో-ఏమో!

హృదయమంటే? రక్తమాంసాలతో నిర్మితమైన గుండేనా? స్పందించడమంటే అదివేసే చప్పుళ్ళేనా?

లాబ్‌డబ్....లాబ్‌డబ్....లాబ్‌డబ్.

ఇవి గడియారం చేసే టిక్‌టిక్ ధ్వనుల్లాంటివేనా?

గడియారం—హృదయం.

గడియారం కాలాన్ని కొలుస్తుంది, కాలాన్ని చెబుతుంది. కాలాన్ని చూపుతుంది—క్షణం క్షణం—క్షణం....క్షణం. ఈ క్షణం!

ఈ క్షణం ఎంతైంది? శ్యామసుందర్ చప్పున చెయ్యి చూసుకున్నాడు. అతని గుండె గతుక్కుమంది. వాచ్....బ్రీఫ్‌కేస్ పోయింది. వాచ్ పోయింది. ఈ క్షణం ఎంతయింది?

"టైమెంతయిందండీ?"

ఆ యువకుడు వాచ్ చూసుకొన్నాడు.

"ఎనిమిదవుతోంది."

"సరిగా—"

"ఏడూయాభై ఎని ...తొమ్...."

శ్యామసుందర్‌కి ఆకస్మాత్తుగా ఏదో థ్రిల్ కలిగింది. ఎని....తౌమ్! యాభై ఎనిమిదీ కాదు. యాభై తొమ్మిదీ కాదు.

"–మ్మిది" పూర్తిచేశాడు ఆ యువకుడు.

శ్యామసుందర్ వినిపించుకొనే స్థితిలో లేడు. ఎని–తౌమ్ మధ్య అతనికి స్పృహ తప్పినట్టయింది. కాదు, ఏదో కొత్త స్పృహ కలిగినట్టయింది. ఆ రెండు అసంపూర్ణ పదాలమధ్య తను దూకి ఓ చేత్తో "ఎన్ని" అనే పదాన్ని రెండో చేత్తో "తౌమ్" అనే పదాన్ని దూరదూరంగా నెట్టివేస్తున్న అనుభూతి కలిగింది. తను ఆ రెంటి మధ్య క్రమక్రమంగా వ్యాకోచం పొందుతూ బృహద్రూపం ధరిస్తున్నట్టు, అంతా తానే ఔతున్నట్టు ఓ వింతభావం కలిగింది. తనే వ్యాకోచం పొందుతున్నాడా ? ఆ క్షణమే తానుగా మారిపోయిందా ? తనే ఆ క్షణమైపోయాడా?

"ఇంతకీ మీరెవరు?" కొంచెం గట్టిగా అడిగాడా యువకుడు.

శ్యామసుందర్ ఆ ప్రశ్నతో ఈ లోకంలోకి వచ్చాడు.

"నేను....నేను"

ఎవరు తను? గడియారం ఎని–తౌమ్ మధ్య ఓక్షణం అంటూందా? హృదయం లాబ్–డబ్ మధ్య ఓ వినిపించని శబ్దం అంటుందా? అదే గురువుగారు చెప్పే "పరా" వాక్కా? ఆ వాక్కే తనా? ఎవరో తను?

"తెలీదండి–నిజం" అన్నాడు శ్యామసుందర్ ఆలోచనగా.

ఆ యువకుడు ఆశ్చర్యంగా, వింతగా అతనివైపు చూశాడు.

"మీరెవరో మీకు తెలీదా?"

"నన్ను రకరకాలుగా పిలుస్తారు–శ్యాం, శ్యామూ, శ్యామాయ్, సుందర్. శ్యామసుందర్, అన్నా, తమ్ముడూ, మామయ్యా, ఓరే, సార్, మిస్టర్, బాబూ, అయ్యా–ఇలా చెబితే మీకేం తెలుస్తుంది నన్ను గురించి–?"

"మీ కింకా పెళ్ళికాలేదని తెలుస్తుంది."

"ఓ" నవ్వాడు శ్యామసుందర్.

"నాకు పెళ్ళయింది. ఇల్లుంది, ఆఫీసుంది, అన్నీ ఉన్నాయి. టైమే లేదు– వస్తా మరి. "గుడ్‌లక్ శ్యామ్యా"అన్నాడా యువకుడు తొందరగా ముందడుగు వేస్తూ,

"శ్యామ్యా ఏమిటి? నేను చెప్పిన పేర్లలో అది లేదే."

"శ్యాం దగ్గిరించి అయ్యా దాకా 'శ్యాయ్యా' అవుతుంది."

"మీరు చాలా హాస్యప్రియులు." గొల్లున నవ్వుతూ అన్నాడు శ్యామసుందర్.

"హాస్యమే మీరు. గుడ్‌లక్" అతను షేక్‌హాండ్ చేసి వెళ్ళిపోయాడు.

శ్యామసుందర్ వదనాన్ని ప్రసన్నత ఆవరించింది. తను హాస్యం కోసం అలా మాట్లాడాడని ఆ యువకుడు అనుకొన్నాడు—పరవాలేదు. తన ప్రసన్నతతో ఇతరుల్ని ప్రసన్నుడ్ని చేసే గుణం అతనిలో ఉంది. హాస్యంగా మాట్లాడుతూనే ఓ నిజం చెప్పాడు. అన్నీ ఉన్నాయిగాని టైపే లేదుట. టైం చాలడంలేదని అతని ఉద్దేశం. కాని అతనికి తెలీదు—అతనికి "టైం"లేదు. అంత హడావిడిలోనూ ఓ కొత్తవ్యక్తితో నవ్వుకొన్న అతన్ని కాలం కొలవదు.

ఆలోచనలతో నడుస్తున్న శ్యామసుందర్ ఎదురుగా వస్తున్న ఓ నడివయసు వ్యక్తిని ఢీకొన్నాడు. ఆయన చేతిలో హాండ్‌బాగ్ కింద పడ్డది, వెంటనే శ్యామసుందర్ వంగి బాగ్ తీసి ఆయన చేతికందించాడు.

"సారీ సార్, క్షమించండి. పరధ్యానంగా నడుస్తూ మిమ్మల్ని చూడలేదు."

"సారీ, నేనూ చూడలేదు."

"అనుకోకుండా అపరిచితులం ఓ విధంగా పరిచయమయ్యాం. నా పేరు శ్యామసుందర్. ఇక్కడికి ఇంటర్వ్యూకి వచ్చాను. మీ పేరు తెలుసుకోవచ్చా ?"

"ఓ ఎస్" అన్నాడాయన కళ్ళజోడు సరిచేసుకొంటూ.

శ్యామసుందర్ నవ్వాడు.

"సారీ, డిస్టర్బ్ చేశాను. మీకు కోపం వచ్చినట్టుంది. ఎక్కడికో త్వరగా వెడుతున్నట్టున్నారు."

"ముందుకి."

శ్యామసుందర్ మళ్ళీ నవ్వాడు. అతనికి కొంచెం కుతూహలం కలిగింది.

"ఓహ్! మీరేం చేస్తున్నారు సార్?"

"ఆలోచిస్తున్నాను" ఈసారి ఆయన కూడా నవ్వాడు.

"తమాషాగా మాట్లాడుతున్నారు."

"తమాషా ఏం లేదు, ఓ ఎక్స్ ఆలోచిస్తూ ముందుకి వెడుతున్నాడు. మరో ఎక్స్ ఆలోచిస్తూ ఎదటినించి ముందుకి వస్తున్నాడు. ఒకేదారి, కాని ఒకరు ఇటునించీ

ఇంకొకరు అటునించీ నడుస్తున్నారు. చూస్తే ఎక్స్‌తో ఎక్స్ భేటీ, లేకపోతే ఎక్స్ ఇంటూ ఎక్స్— ఆలోచన ఇంటూ ఆలోచన, క్లాష్?" అన్నాడాయన నవ్వుతూ.

"మీరేవో సంకేతాలతో మాట్లాడుతున్నారు."

"సంకేతాలతోనే మనం మాట్లాడతాం. అర్థం చేసుకొంటాం. అవి వేటిని సూచిస్తాయో వాటిని అనుభూతి పొందుతాం. మన జ్ఞానం, నాగరికత వృద్ధిపొందటానికి అవే కారణాలు."

"సంఘర్షణలకి కూడా, మన గుళ్లూ, దేవుళ్లూ, భాషలూ, జండాలూ, అంకెలూ, బొమ్మలూ, ఈక్వేషన్లూ....ఇవన్నీ ఏమిటి ? ఇవేం చెబుతాయి ? ఎందుకు మనిషి ఇవన్నీ నేర్చుకొంటున్నాడు! వీటివల్ల ఏమిటి ప్రయోజనం?" ఆవేశంగా అన్నాడు.

"అంటే విద్యవల్ల ఏమిటి ప్రయోజనం అన్నట్టే. మీ మెదడు మీకు ఆకలేస్తోందని చెబుతుంది. ఆకలి తీర్చదు."

"అంటే?"

"విద్య ఎక్స్ విలువ చెబుతుంది. అంతే. నేను బోర్డుమీద లెక్కవేస్తాను. లెక్కల మాస్టార్ని. ఎక్స్ విలువ సరిగా తేల్చగలను గాని దానివల్ల ప్రయోజనం ఏమిటో నా తెక్కల్లేదు. వస్తానండీ. మిమ్మల్ని కలుసుకున్నందుకు సంతోషంగా ఉంది."

ఆ వ్యక్తి ముందుకి సాగిపోయాడు. శ్యామసుందర్ ఆయనవైపోసారి చూసి తనూ ముందుకి అడుగేశాడు. ఆయన దృష్టిలో తను వెనక్కి, తన దృష్టిలో ఆయన వెనక్కి వెడుతున్నారు. ఆ భావనకి అతనికి నవ్వొచ్చింది.

ఆ వ్యక్తి ఆకలి సంగతి ఎత్తేసరికి శ్యామసుందర్‌కి ఆకలి గుర్తుకి వచ్చింది. పొద్దున్నే ఏదో తినటం అలవాటు. ఆ ధ్యాస మర్చిపోవాలి. శ్యామసుందర్ గబగబ నడవసాగాడు. ఏవేవో ఆలోచనలు అతని మనసులో ముసురుకుంటున్నాయి.

శ్యామసుందర్ ఉస్సూరంటూ జనరల్ పోస్టాఫీస్ చేరుకొన్నాడు. సికిందరాబాద్ స్టేషన్‌నించి ఆబిడ్స్‌దాకా నడిచాడంటే అతనికే ఆశ్చర్యం వేసింది. అవసరం ఏ పనైనా చేయిస్తుందేమో ! పోస్టాఫీస్‌లో ఓ కార్డు కొన్నాడు. నాన్నకి తన పరిస్థితి తెలియచేస్తూ వెంటనే టి.ఎమ్.ఓ. ద్వారా పోస్ట్‌మాస్టర్ కేరాఫ్‌కి డబ్బు పంపవలసిందనీ రాసి పోస్ట్ చేశాడు. పోస్ట్‌మాస్టర్‌ని కలుసుకొని విషయం చెప్పి బయటికి వచ్చాడు.

రోడ్డుమీదికి వచ్చేసరికి ఎవరో కుర్రాడు చెయ్యి చాపాడు. అయిదు పైస లిచ్చాడు. ఇంకెవరో ఇద్దరు ఆశగా పరిగెత్తుకు వచ్చి చేతులు చాపారు. చెరో అయిదు పైసలూ ఇచ్చాడు. జేబు ఖాళీ. తను ఎవరిముందైనా చెయ్యి చాపగలడా ? ప్రాణం పోయినా తనాపని చెయ్యగలడా ? ఏం ? అభిజాత్యమా? అహంకారమా? నిర్లిప్తతా? ఏమో !

అలాగే నడిచి సర్వీస్ కమిషన్ ఆఫీసుకి వెళ్ళాడు. సందేహిస్తూనే అక్కడ సర్టిఫికెట్లు చెక్ చేసే ఉద్యోగితో విషయం చెప్పాడు. పోలీస్ వారిచ్చిన సర్టిఫికెట్ చూపించాడు. ఆ ఉద్యోగి రూల్సు రూల్సే నన్నాడు. "అయినా బ్రీఫ్ కేస్ పోయిందని ఫిర్యాదు చేసినట్టు సర్టిఫికెట్ లో రాశారు గాని, అందులో సర్టిఫికెట్లు ఉన్నాయో లేవో ఎవరికి తెలుసు ?" అన్నాడు.

శ్యామసుందర్ నిరాశతో బయటికి వచ్చాడు. తను నిజంగా శ్యామసుందర్ అనే వ్యక్తేననీ, తనకి యూనివర్సిటీ వాళ్ళు మంచి నడతతో అనేక సంవత్సరాలు కష్టపడి చదివి పరీక్ష పాసైనందుకు సర్టిఫికెట్లు ఇచ్చినమాట వాస్తవమేనని చెప్ప టానికి ఎవరూ లేరు. చెప్పినా అది అధికారులు నమ్మినా రుజువు లిఖితరూపంలో లేదు. కనుక ప్రయోజనం లేదు. తన బ్రీఫ్ కేస్ అదృశ్యమైపోయింది. దాంతో తన గతమూ అదృశ్యమై పోయిందా !

తను గతంలేని వ్యక్తి ! గతం తనని ముందుకి తోసి తప్పుకుంది. శ్యామ సుందర్ కి అకస్మాత్తుగా అమ్మ జ్ఞప్తికి వచ్చింది. తనని బళ్ళో వేసిన రోజునే అమ్మ ఈ ప్రపంచంవించి నిష్క్రమించింది. చదువులోపడి అమ్మని క్రమంగా మర్చి పోయాడు.

"అమ్మా" అన్నాడు శ్యామసుందర్ అప్రయత్నంగా.

"బాబూ" అని ఏ అంతరాంతరాలనో తాకినట్టుగా హృదయంలో అమ్మ గొంతు ప్రతిధ్వనించినట్టయింది. శ్యామసుందర్ ఒక్కక్షణం మైమర్చిపోయాడు.

తన భవిష్యత్తుకోసం అమ్మ ఎన్నో కలలు కని ఉంటుంది. బళ్ళో వేసేరోజు తను ఏ గొప్ప డాక్టరో, ఆఫీసరో కావాలని దేవుడికి దణ్ణం పెట్టుకొని ఉంటుంది. మంచి భవిష్యత్తు కోసమే ఈ రోజు హైద్రాబాద్ లో ఇంటర్వ్యూ కోసం అడుగు

పెట్టాడు. కాని ప్రస్తుతం తను ఎదురుచూస్తున్న భవిష్యత్తూ — రేపు విజయవాడనించి వచ్చే టి.ఎం.ఓ! భవిష్యత్తులో ఏముందో ? ఈ లోపల ఏదైనా జరగొచ్చు ! అది అనిశ్చితం- కనీసం తనకి తెలేదు.

బ్రీఫ్‌కేస్ గురించి ఆలోచించటం వల్ల ప్రయోజనం లేదు.

టి.ఎం.ఓ. కోసం ఎదురుచూడటం వల్ల అది రాదు.

బ్రీఫ్‌కేస్ - టి.ఎం.ఓ. ఈ రెండిటి మధ్య ఓ శ్యామసుందర్. ఓ ఎక్స్ ! ఈ భావనకి అతను నవ్వుకొన్నాడు. అతనికి ఏం చేయాలో తోచలేదు. ఓ చోట కూర్చో బుద్ధి పుట్టలేదు. నడుస్తున్నాడు. మనుషుల్ని, స్థలాన్ని, చెట్లనీ పరకాయించి చూస్తు న్నాడు. మనుషులవైపు తను చూస్తుంటే వాళ్ళు తనవైపు చూస్తుంటే పలకరించు కొన్నట్టే ఏదో అనుభూతి కలిగింది. కానీ ఎవర్నీ పలకరించలేదు. దృశ్యాలు రమణీ యంగా అలరారుతూ అలరిస్తున్నట్టున్నాయి. ఏవో పక్షులు ఎక్కడెక్కడి నుంచో స్వాగత గీతాలు పాడుతున్నట్టుగా ఉంది. కృష్ణశాస్త్రిగారి "ఆకులో ఆకునై, పూవులో పూవునై —" గీతం ఎక్కడనించో హృద్యంగా, ఆ పాట మధురంగా వినిపిస్తోంది.

శ్యామసుందర్ ఆలోచించటం లేదు. కనపడ్డవి చూస్తున్నాడు, వినపడ్డవి వింటున్నాడు.

అతను తిరిగి తిరిగి అలసిపోయాడు. ఓ లైబ్రరీ కనిపిస్తే లోపలికి వెళ్ళాడు. ఏవేవో పత్రికలు తిరగెయ్యసాగాడు. నిమిషాలు, గంటలు గడిచిపోతున్నాయి.

లైబ్రరీలో గడియారం ఆరు చూపించింది. శ్యామసుందర్ లైబ్రరీ బయటికి వచ్చాడు. అతనికి బాగా ఆకలి వేస్తోంది. కుళాయి కనిపిస్తే మంచినీళ్ళు తాగాడు. కాళ్ళు తీసుకువెళ్ళేదారిన నడుస్తున్నాడు.

ఎదురుగా మేళతాళాలతో హరేకృష్ణ భక్తబృందం పరవశంతో తాండవ నృత్యం చేస్తూ వస్తున్నారు. వాళ్ళవైపు శ్యామసుందర్ దీక్షగా చూశాడు. భక్తితో వాళ్ళు అలా పబ్లిక్ రోడ్డుమీద ఏ సంకోచం లేకుండా ఆడుతూ పాడుతూ పరవశించి పోవటం అతన్ని ఆకర్షించింది. నెమ్మదిగా వాళ్ళవైపు నడిచాడు. వాళ్ళలోకి చేరాడు. అతన్ని చూసి మద్దెల వాయిస్తున్న వ్యక్తి అతనికి మద్దెల అప్పగించాడు. శ్యామ సుందర్ హాబీగా మృదంగవాద్యం నేర్చుకొన్నాడు. ఉత్సాహంతో మృదంగం వాయిస్తూ వాళ్ళతో పాటు అతను చిందులుతొక్కుతూ "హరేకృష్ణ" భజన సాగించాడు.

భక్తిపారవశ్యంతో ఆబృందం ముందుకి సాగిపోతోంది. కాని శ్యామసుందర్‌కి ఎందుకో పారవశ్యం ఏమీ కలగటం లేదు. అతనికి వారందర్నీ చూసి తనూ ఆ విధంగా తన్మయత్వం పొందాలని గాఢంగా అనిపించింది. కాని అది సాధ్యం కావటంలేదు. తనలో భక్తి లేదా ? తను ఆ స్థాయికి చేరుకోటానికి చాలా కృషి చేయాలా? లేక అది కొందరికే సాధ్యమా?లేక తనకి ఆకలి వేస్తుండటంవల్ల మనసు లగ్నం చెయ్యలేకపోతున్నాడా? ఏమో!

ఆకలి! విపరీతంగా వేస్తున్న ఆకలి! ఏమిటి ఈ ఆకలి? ఆకలి తీర్చుకోటమే మనిషి ప్రధాన కర్తవ్యమా? బతకాలి, బతకాలి అని జీవుడు చేసే హెచ్చరికేనా ఆకలంటే?

"మాతా అన్నపూర్ణేశ్వరీ!" అని ఎవరో పొలికేక పెట్టినట్టు వినిపించినట్టయింది ఆ మేళతాళాల మధ్య అతనికి. ఎవరు? చుట్టూ చూశాడు. ఎవరు? ఒకవేళ తనలోంచే వచ్చిందా ఆ కేక? అలాంటి కేక తను వెయ్యగలడా? రావిశాస్త్రి వేశారు దిక్కులు పిక్కటిల్లేట్టు. తను రచయిత కాడు.

అయినా తను మొండివాడు. తనని ఆకలేంచేస్తుంది? కృష్ణుడు గొప్పవాడే — తను గీత చదివాడు. ఒక విశిష్టతాత్త్విక సందేశం అందులో తనకి గోచరించింది. ఒక ఉత్తమ జీవిత విధానం అది బోధిస్తుంది. కాని తత్త్వం వేరు, భక్తివేరు. కృష్ణుణ్ణి పూజిస్తే ఆరాధిస్తే, రాముణ్ణి పూజించే, ఆరాధించేవాళ్ళు ఇతర వర్గంలో వాళ్ళవుతారు కదా! ఏమిటి ఈ వర్గాలు. వర్గాలు నిజమా? వర్గాలంటే భేదాలు, భేదాలుంటే సమ దృష్టి ఉండదు.

తను అందుకే వాళ్ళలా లీనం కాలేకపోతున్నాడా!

శ్యామసుందర్ మద్దెల వాయిస్తూనే ఉన్నాడు కాని 'హరేకృష్ణ' అనటంలేదు. మద్దెల ఇచ్చిన వ్యక్తి 'గానం చెయ్యండి' అన్నాడు. శ్యామసుందర్ చిన్నగా నవ్వుతూ మద్దెల అతనికి ఇచ్చివేసి ఆ బృందం నుండి విడివడ్డాడు.

బషీర్‌బాగ్‌లో ఓ కళ్యాణమంటపం రంగురంగుల దీపాలతో కాంతులు వెద జల్లుతోంది. "స్వాగతం" బోర్డు అతనిలో ఓ ఆలోచన రేపింది. పోనీ, కాసేపు లోపలికి వెళ్ళి కూర్చుంటే ఏం? పిలవని పేరంటం! అయితే ఏం? తనేమీ ఆశించి వెళ్లటంలేదు. వివాహ మహోత్సవం అంటే తనకో ఆకర్షణ. శ్యామసుందర్ అడుగు ముందుకేశాడు. "కృష్ణవేణి వెడ్స్ రత్నాకర్".

హాలు మొగదల అతిథులకు పువ్వులిచ్చి చిరునవ్వులతో పలకరించి పన్నీరు చిలకరించి స్వాగతం చెబుతున్నారు.

శ్యామసుందర్ గులాబీపువ్వు అందుకుంటూ కొంచెం బెరుగ్గా కళ్లెత్తి చూశాడు. ఆమె చూసింది. ఎందుకో అతని హృదయం ప్రఫుల్లమైంది. ఒక్కక్షణం అతని మనసులో ఆలోచనలన్నీ అదృశ్యమయాయి. ఒక్కక్షణం తరువాత అతను చిరునవ్వుతో లోపలికి వెళ్లాడు. ఓ కుర్చీలో కూర్చున్నాడు. వివాహం జరుగుతోంది. మేళం చేస్తున్నారు. మంత్రాలు చదువుతున్నారు. కృష్ణవేణి వెడ్స్ రత్నాకర్.

శ్యామసుందర్‌కి ఏదో తెలియని ఆనందం కలిగింది. ఏ వివాహమైనా అతను సంబరపడతాడు. ఏ ఇద్దరో దగ్గరవుతారు. అందరూ ఆశీర్వదిస్తారు.

అక్షింతలు వేస్తున్నారు. అతనూ లేచి అక్షింతలు వేశాడు.

"అయ్యా, అంతా భోజనాలకి దయచేయండి." ఓ పెద్ద అతిథుల్ని ఆహ్వానిస్తున్నాడు. శ్యామసుందర్ గబగబా హాలు బయటికి వచ్చేస్తున్నాడు.

"భోజనానికి దయచేయండి, వెళ్లిపోతున్నారేం" ఎవరో అతన్ని ఆపి ఆహ్వానించారు.

"త్వరగా వెళ్ళాలండి."

"వివాహానికి వచ్చి భోంచెయ్యకుండా వెడతారా, ఇంకా నయం" ఆయన శ్యామసుందర్ చెయ్యి పట్టుకొని టేబిల్ దగ్గిరికి ఇంచుమించు లాక్కువెళ్ళి కూర్చోబెట్టాడు.

శ్యామసుందర్ సందిగ్ధంలో పడ్డాడు; ఆకలి దహిస్తోంది, కాని తనకి విందుకి హాజరయ్యే హక్కు లేదు.

"నీళ్లు చల్లండి ఆకుమీద" ఎవరో పదార్థాలు పట్టుకొచ్చి అన్నారు. శ్యామసుందర్ అప్రయత్నంగా విస్తట్లో నీళ్లు చల్లాడు. ఇంతలో ఓ మూల కొంచెం రభస జరిగింది. ఎవరో ముష్టివాళ్లలాంటి సన్యాసులిద్దరు ఎగబడుతున్నారు. ఇప్పుడు కాదని వాళ్లని ఎవరో బయటికి తరిమేస్తున్నారు.

శ్యామసుందర్‌కి కూర్చోబుద్ధి పుట్టలేదు. చప్పున లేచాడు.

"అదేమిటండీ. లేచి వెడుతున్నారే?" మృదు మధుర స్వరం.

అతను చప్పున తలెత్తి చూశాడు. ఆమె! కొంచెం తత్తరపడ్డాడు. చప్పున ఓ ఆలోచన స్ఫురించింది.

"గురువారం అని గుర్తొచ్చిందండీ! గురువారం రాత్రి నేను భోజనం చెయ్యను"

"అయితే ఫలహారం చేద్దురుగాని రండి ప్లీజ్," ఆమె దారితీసింది.

శ్యామసుందర్‌కి ఎలా తప్పించుకోవాలో తెలియలేదు. యాంత్రికంగా ఆమెని అనుసరించాడు. ఆమె అతన్ని వంటింటి దగ్గరగా ఉన్న స్థలంలో కూర్చో పెట్టింది. తనే లోపలికి వెళ్ళి ఆకులో కొన్ని ఫలహారాలు పెట్టి తెచ్చి అతనిముందు పెట్టింది.

"మీరు అక్కయ్య ఫ్రెండనుకొంటాను."

"అక్కయ్యంటే ?" అనుమానంగా అడిగాడతను.

"పెళ్ళికూతురు మా అక్కయ్యే. మీరు క్లాస్‌మేటా ?"

"కాదు."

"నాన్నకి—"

"ఊఁహూఁ—"

"పెళ్ళికొడుకు ఫ్రెం—"

"కాదు. ఇక్కడెవరూ నాకు తెలియదు. సరదాగా పెళ్ళి చూద్దామని వచ్చాను. భోజనం చెయ్యమని పిలిచారు. కూర్చున్నాను కాని....కాని భోజనం చెయ్యలేను. మీరు ఇక్కడికి-" అతను పూర్తి చెయ్యలేదు.

ఆమె అతని వైపు వింతగా చూసింది. సరదాగా పెళ్ళి చూడటానికి రావట మేమిటి ! ఎవరితను ?

"అలాగా ! ఫలహారం చెయ్యండి" అందామె అతని కళ్ళలోకి చూస్తూ.

"అభ్యాగతుల్ని సత్కరించే ఆచారం ఇప్పుడు లేదనుకొంటాను."

"అభ్యాగతులా !"

"పూర్వం ఇంటి యజమాని భోజనానికి కూర్చునే ముందు వాకిట్లోకి వచ్చి ఎవరైనా ఎదురువస్తున్నారేమో చూసి, అలా ఎవరైనా కనిపిస్తే వాళ్ళని భోజనానికి ఆహ్వానించేవారట. అతిథులుకాక వీళ్లు ఎక్స్‌ట్రా అన్నమాట."

ఆమె నవ్వింది. ఎవరీతను- ఈ అభ్యాగతుడు !

"ఎవరూ ఆకలితో ఉండకూడదని దాని అర్థం. ఆ రోజులు అలాంటివి. మీరు ఫలహారం చేస్తుండండి. నాకు సూపర్‌విజన్ డ్యూటీ ఉంది."

"థాంక్యూ."

ఆమె బంతిలోకి వెళ్ళింది. శ్యామసుందర్ విప్పారిన ముఖంతో ఆమె అలా వెడుతుండగా చూస్తూ కూర్చున్నాడు. తను వాళ్లెవరికీ ఏమీ కాదంటే ముఖం చిట్లించు కోలేదేం ! పైగా చిరునవ్వులు చిందించింది. తన పరిస్థితి ఆమె కనిపెట్టింది. కాని ఆకలిగా ఉన్న ఓ వ్యక్తికి కొంచెం తిండిపెడితే ఏం పోయిందని అనుకొని ఉంటుంది.

శ్యామసుందర్ ఫలహారాలవైపు వేదాంతిలా చూశాడు. ఆమె కనుమరుగైంది. నెమ్మదిగా లేచాడు. తనని ఎవరూ గమనించటంలేదు. పక్కపక్కలకి తప్పుకోవాలని వెనక్కి నాలుగడుగులు వేశాడు.

"అదేమిటి, తినకుండా వదిలేసి పోతున్నారేం - అయ్యో ! అమ్మాయ్ రాధా ఇక్కడెవరూ కనుక్కోటం లేదమ్మా-రాఘీ" ఎవరో ఓ పెద్ద ముత్తయిదువ నొచ్చు కుంటూ అంది.

"ఆఁ—వస్తున్నానమ్మా."

"ఆకల్లేదండీ క్షమించండి. వేస్ట్ చెయ్యటం ఎందుకని—" అబద్ధం నసిగాడు.

ఆమె అతన్ని తేరపార చూసింది.

"ఉన్నంతవరకే తీసుకోండి" ఆమె అక్కడే నిలబడ్డది. శ్యామసుందర్కి ఏమీ పాలుపోలేదు. ఏం చెబుతాడు? ఆ భిక్ష స్వీకరిస్తాడు? ఆమె దగ్గరికి రెండడుగులు వేశాడు.

"సారీ—మేడమ్—నన్ను వెళ్ళనివ్వండి. ఇక్కడ విందులో పాల్గొనే హక్కు లేదు. నేను నేను—తెలివితక్కువగా ఇక్కడికి వచ్చాను. ఆకలి మీద రాలేదు నిజం."

"అని ఎవరన్నారు? పెళ్ళిపందిరి నించి ఎవరూ ఆకలితో పోకూడదు."

"అతిథులు—"

"అభ్యాగతులూ!"

అతను నవ్వాడు.

"నే నెవర్నీ కాను. ఓ అపరిచితుణ్ణి. శ్యామసుందర్ అనే ఓ ఎక్స్ని. ఈ ఊరుకి పొద్దున విజయవాడ నించి వచ్చాను. సర్వీస్కమిషన్ ఇంటర్వ్యూకి. రైల్లో బ్రీఫ్కేస్ పోయింది—డబ్బుతో, సర్టిఫికెట్లతో, వాచ్ పెన్లతో సహా. ఇంటర్వ్యూకి వీల్లేదన్నారు. ఓ కార్డు కొని ఇంటికి రాశాను టి.ఎం.ఓ. పంపమని. జేబులో ఇంకా పదిహేను పైసలుంటే దానం చేశాను. రేపు టి.ఏం.ఓ. వచ్చేదాకా హైద్రాబాద్ రోడ్ల మీదే తిరగాలి. ఇలా తిరుగుతూ ఇక్కడ పెళ్ళి జరుగుతుంటే వచ్చాను. ఊరికే

చూసిపోదామని. ఇంకేం ఉద్దేశం లేదు. పెళ్లి ఎక్కడ ఎవరికి జరుగుతున్నా నాకెందుకో చాలా సంతోషంగా ఉంటుంది. అందుకే వచ్చాను—ఆకలి తీర్చుకోటం కోసం కాదు. ఆతను చెప్పవలసింది చెప్పేశాననే తృప్తితో ఆమెవైపు చూశాడు.

"పొద్దుటినించి ఏమీ తినలేదా?" అందామె అతని వైపు దీక్షగా చూస్తూ.

"లేదు. రేపు టి.ఎం.ఓ. వచ్చేదాకా ఏమీ తినను."

"పట్టుదలా?"

"కాదు. అలా అనుకొన్నాను, అంతే క్షమించండి."

"ప్లీజ్ ఫలహారం చేసి—కాదు—భోజనం చేసి వెళ్ళండి. ఇది పెళ్లిపందిరి" అందామె మృదువుగా.

"సారీ. వస్తానండి" అతను వెళ్లటానికి ఉద్యుక్తుడయ్యాడు.

"మిస్టర్ టి.ఎం.ఓ." అని అప్రయత్నంగా అని తొందరపాటుకు కొంచెం సిగ్గుపడి, 'సారీ' అందామె.

"పరవాలేదండి. పొద్దున రిపోర్టిచ్చినప్పుడు ఎస్. ఐ. మిస్టర్ 'బ్రీఫ్‌కేస్' అన్నాడు. దానికేం?"

"బ్రీఫ్‌కేస్ పోయిందనే నిరాశతో, టి.ఎం.ఓ. వస్తుందనే ఆశతో మీ ఆకలిని మీరు మర్చిపోటానికి ప్రయత్నిస్తున్నారు. కాని మర్చిపోలేరు, మీ రెవరో అది మాటి మాటికీ గుర్తుచేస్తుంది."

"నేనెవర్నంటారు?"

"కాసేపు బ్రీఫ్‌కేస్‌ని, టి.ఎం.ఓ. ని మర్చిపోతే మీకే తెలుస్తుంది. కూర్చోండి, భోజనం తెప్పిస్తాను. అసలైన ఆకలంటే నాకూ ఓసారి తెలిసింది ఓ నిరాహారదీక్షలో. ఎం.ఏ. ఫైనల్‌లో మా హాస్టల్ విద్యార్థినులం—ఓ, అదంతా ఎందుకు లెండి—"

ఇంతలో "రాధీ" అంటూ వాళ్ళ అమ్మ వచ్చి ఇద్దర్నీ చూస్తూ "అదేమిటమ్మా, ఈయన అలాగే నిలబడి ఉన్నాడేం ఇంకా? చాలా మొహమాటస్తుడులా ఉంది. కూర్చో నాయనా! ఫలహారం చెయ్యి, ఎవరమ్మా ఈ అబ్బాయి, గుర్తు రావటం లేదు" అంది.

ఆమె శ్యామసుందర్ వంక పైనించి కిందిదాకా చూసింది. అతని దుస్తులు అంత మర్యాదకరంగా లేవు, నలిగిపోయి ఉన్నాయి. ముఖం కళగానే ఉన్నా వాడిపోయి ఉంది.

"మా ఫ్రెండ్-" విస్సంకోచంగా అందామె.

"అలాగా, కూచో బాబూ. ఫలహారం కానియ్యి" అంటూ ఆమె వెళ్లి పోయింది.

"ఓ ఎక్స్‌ని మా ఫ్రెండని చెప్పినందుకు చాలా థాంక్సండీ—" అన్నాడతను.

"ఆ మాటకొస్తే నేనూ ఎక్సే-అందరూ ఎక్సలే !"

శ్యామసుందర్‌కి అకస్మాత్తుగా లెక్కల మాస్టారు గుర్తుకొచ్చాడు. అతనితో ఢీకొన్నాడు. ఇక్కడ ఇప్పుడు ఈ ఎక్స్‌తో ఇక్కడ ఘర్షణ లేదు, ఇంటర్వ్యూలేదు-ఇక్కడ, ఇప్పుడు ఈ క్షణం-అతనికేదో థ్రిల్ కలిగింది.

"మేడమ్" అన్నాడతను.

"కూర్చోండి. ఆకలికి నిన్న రేపు లేవు. ఆకలి తెలిసేది ఈ క్షణమే. భోజనం తెస్తాను" ఆమె కదిలింది.

శ్యామసుందర్ ఆలోచనలన్నీ ఒక్కసారిగా అదృశ్యమయ్యాయి. అతనిలో ఏ జ్ఞాపకమూ లేదు, ఏ ఆశా అతణ్ని ఉత్సాహవంతుణ్ని చెయ్యటంలేదు. క్షణమేదో తానేదో ఐపోతున్నట్టుగా లాబ్-డబ్‌ల మధ్య వినిపించని శబ్దం ఏదో వినిపిస్తున్నట్టుగా అనుభూతి కలిగింది. "ప్లీజ్" అనే మాటకే అతనికి పరిసరాల స్పృహ కలిగింది.

[యువ దీపావళి 1985]